క్లుప్తంగా

ముమ్మరంగా వాహనాల తనిఖీ



మక్తల్: వాహనదారులు తప్పనిసరిగ్గా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని రోడ్డు భద్రత వారోత్సవాల భాగంగా వాహనాల తనిఖీలు ముమ్మరంగా చేస్తున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతి వాహన దారుడు డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్సు కలిగి ఉండాలని అన్నారు. అలాగే ఆటోలో పరిమితికి మించి ప్యాసింజర్లును ఎక్కించొద్దన్నారు. రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని, మద్యం తాగి వాహనం నడపొద్దని, వేగంకంటే ప్రాణం ముఖ్యమని అన్నారు. ప్రతి వాహనాలకు నంబర్‌ప్లేట్ వేయించుకోవాలన్నారు. ఎస్‌ఐ–2 అచారి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మరికల్: పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఫిబ్రవరి 2న నిర్వహించే పూసల్‌పహాడ్ టాలెంట్ టెస్ట్‌ను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు శేర్ కృష్ణారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో టాలెంట్ టెస్ట్‌ను నిర్వహిస్తామన్నారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు ఈ టెస్ట్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి సబ్జెక్టు నుంచి 25 ప్రశ్నలను 150 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలను, 150 మార్కులతో నిర్వహిస్తామన్నారు జిల్లా టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతి, పాఠశాల టాపర్లుకు ప్రోత్సాహకర బహుమతులు అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



మరికల్: ఆలయ పూజారి మృతితో నిలిచిన ఆంజనేయస్వామి నిత్య పూజలను తిరిగి ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని నీటితో శుభ్రంచేసి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఈ విషయాన్ని గమనించి పూజలకు హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నిఖిల్, లక్ష్మికాంత్, ఆనంద్, భాస్కర్, పట్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు



ఊట్కూరు: అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ సి. రవి తెలిపారు. ఆదివారం మండలంలోని నాగిరెడ్డి పల్లివాగు శివారు ప్రాంతంలో అక్రమంగా ఇసుకను డంపు చేశారని ఫిర్యాదు రావడంతో ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఇసుక డంపు చేసిన ప్రాంతం కర్ణాటక రాష్ట్ర చేలేడు గ్రామ శివారులో ఉన్నందున డంపును సీజ్ చేయడం కుదరదని తెలిపారు. ఎవరైనా ఇసుక అవసరం అనుకుంటే ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆర్‌ఐ కృష్ణారెడ్డి, గోవింద్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

భజరంగ్ దళ్ మండల కమిటీ ఎన్నిక

మాగనూర్: మండల భజరంగ్ దళ్ మండల కమిటీ ఎన్నిక రాష్ట్ర గోరక్ష అధ్యక్షుడు సురేష్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంయోజక్ వంశీకృష్ణ, సహ సంయోజక్ నవీన్‌కుమార్, గోరక్ష ప్రముఖ్ మహేష్, విష్ణు, గోరక్ష సాహ రాకేష్, లడ్డు, విద్యార్థి ప్రముఖ్ లోకేష్, నరేష్, సురక్ష ప్రముఖ్ పవన్, రవి, గోపి, నందు, బాలకృష్ణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గోరక్ష అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ.. హిందూ ధర్మం పట్ల బజరంగ్ దళ్ యొక్క విశిష్టతను నూతన కమిటీ సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు భీమేష్, రామాంజనేయులు, అంజి, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.



పడిపోయిన టమాట ధరలు

- కిలో టమాట ఐదు రూపాయలకే..
- దిగుబడి పెరగడంతో తగ్గిన రేట్లు
- ఆందోళనలో రైతులు



ధర తగ్గిన టమాటను కుప్పగా పోస్తున్న రైతు



కూరగాయలను విక్రయిస్తున్న వ్యాపారుస్తులు

మరికల్: నిన్న, మొన్నటి వరకు చుక్కలు చూపించిన టమాట ధరలు.. ఇప్పుడు నేల చూపులు చూస్తోంది. మరి ముఖ్యంగా జిల్లాలో చాలా వరకు ధరలు తగ్గాయి. టమాట దిగుబడి భారీగా పెరగడంతో కిలో టమాటా ఐదు రూపాయలకే లభిస్తుండటంతో.. పెట్టుబడి ఖర్చు కూడా రాక అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరలు భారీగా తగ్గిపోయాయని.. దీంతో కోత, రావాణా ఖర్చులు సైతం రావడం లేదని రైతులు లబోదిబోమంటున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మార్కెట్‌లో ఇదే పరిస్థితి నెల కొందని రైతులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో ఇలా..

మండలంలో అప్పంపల్లి, వెంకటాపూర్, పెద్దచింత కుంట, పల్లెగడ్డ గ్రామాల్లో అధిక శాతం రైతులు తోటలను సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గత పక్షం రోజుల నుంచి టమాట ధర పాతళానికి పడిపోవడంతో కనీసం తోటలకు పెట్టిన పెట్టుబడులు సైతం రాని పరిస్థితి ఏర్పడింది. కిలో టమాటాను రైతులవద్ద కేవలం రూ. 5లకే కొనుగోలు చేసిన వ్యాపారులు మాత్రం వినియోగదారులకు కిలో రూ. 10 చొప్పున అమ్ముకుంటున్నారు. ఒక కిలో వెంబడి రైతులు రూ.7 చొప్పున నష్టపోవాల్సిన పరిస్థితి తలెత్తింది.

నష్టాలు వచ్చాయి ..



మార్కెట్‌లో టమాటకు ధర లేకపోవడంతో నష్టాలను చావి చూస్తున్నాం. అర్ధ ఎకరా పొలంలో చిక్కుడు, బెండ, టమాటా, బీర తదితర ఆకు కూరగాయలను సాగు చేశాను. పది రోజుల వ్యవదిలోనే టమాటాకు ధర పతనం కావడంతో ఆశలు ఆవిరయ్యాయి. తోటలకు పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితి వచ్చింది.

– వెంకట్‌రెడ్డి, అప్పంపల్లి

తక్కువ ధరకే కొంటున్నారు.



రైతులతో వ్యాపారులు తక్కు వ ధరకే టమాటను కొనుగోలు చేయడంతో తీవ్రంగా నష్టం వచ్చింది. తమ గ్రామంలో తనతో పాటు అధిక శాతం రైతులు కూరగాయలను సాగు చేస్తాం. మార్కెట్‌లో టమాటకు ధర దిగిపోవడంతో రైతులతో కిలో టమాట రూ. 5 కొనుగోలు చేసిన వ్యాపారులు రూ. 10కి అమ్ముకుంటున్నారు. దీంతో లాభం లేక నష్టాలను చావిచూస్తున్నాం.

– నర్సిరెడ్డి, రైతు, అప్పంపల్లి

విజేతలకు బహుమతుల ప్రదానం



మరికల్‌లో మాట్లాడుతున్న ఎస్‌ఐ రాము



విజేతలకు ట్రోఫీలు అందిస్తున్న నిర్వాహకులు

మరికల్: యువజన వారోత్సవాల ముగింపులో భాగంగా ఆదివారం బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎస్‌ఐ రాము ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.. స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకున్న వారు భవిష్యత్‌లో దేనినైనా సాధిస్తారన్నారు. అనంతరం క్రికెట్, వాలీబాల్, కబడ్డీ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యువక మండలి అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, సూర్యమోహన్‌రెడ్డి, వీరన్న, వేణు, హరీష్, కృష్ణయ్య, రామన్‌గౌడ్, మల్లయ్య, సూర్యప్రకాష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండలంలోని భూనీడులో పదకొండు రోజుల పాటు కొనసాగిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ఫైనల్ మ్యాచ్ నిర్వహించగా ఫైనల్‌లో గెలిచిన జట్టుకు రూ. 20వేలు, రన్నర్ జట్టుకు రూ. 10వేల చెక్కులను మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోట్ల మహేందర్ రెడ్డి చెక్కులతో పాటు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో పలు గ్రామాల క్రీడాకారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలను జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

దామరగిద్ద: సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం గ్రామ కార్యదర్శి ప్రకాష్, వీవైఎఫ్‌ఐ, కేవీపీఎస్ నాయకుడు మల్లేష్, సీపీఎం మండల కార్యదర్శి గోపాల్ పిలుపునిచ్చారు. మండలంలోని ఉగ్మల్‌గిద్దలో ఆదివారం సీపీఎం మహాసభల వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 25 నుంచి 28వరకు సంగారెడ్డి జిల్లాలో సీపీఎం నాల్గవ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాటం చేసేందుకు సీపీఎం ఎప్పుడు ముందుంటుందని, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో భీంషప్ప, శంకర్, హన్మంతు, కాశప్ప, రాజు, తాయప్ప పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పేటలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు



దామరగిద్దలో..

నారాయణపేట రూరల్: పట్టణంలోని ప్రభుత్వ గ్రౌండ్ ఉన్నత పాఠశాలలో 1999– 2000 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరికొకరు వారి చదువు, ఉద్యోగ జీవితంతోపాటు వివాహ విషయాలు మాట్లాడుకున్నారు. అదేవిధంగా పాఠశాలలో పూర్వ జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. అనంతరం నాడు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

దామరగిద్ద: మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1990–91 పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలోని సంజయ్ ఫాంహౌజ్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అందరూ ఒకేచోట కలుసుకుని తమ చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. అనంతరం పూర్వ ఉపాధ్యాయులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నర్సింహులుగౌడ్, శివకుమార్, పూర్వ విద్యార్థులు రవికుమార్, వెంకట్రాములు, వెంకటేశ్వర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, రామకృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

కంప్యూటర్ శిక్షణ ధ్రువపత్రాల అందజేత



ఊట్కూరు: మండలంలోని టార్చ్ దక్కన్ ఎడ్యుకేషన్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో కంప్యూటర్ శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులకు ధ్రువపత్రాలను ఆదివారం పంపిణీ చేశారు. ఆరు నెలలుగా సంస్థ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ అందిస్తున్నారు. 3నెలల కోర్సు పూర్తి కావడంతో ధ్రువ పత్రాలను అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సలీం నవాబ్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్‌గౌస్, నాయకులు కాసీంహుస్సేన్, అబ్దుల్‌రహమాన్, నజీర్ అహ్మద్, మునీర్‌అహ్మద్ పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ పంచాయతీలోని టైరోడ్డు సర్కిల్‌లో ఆదివారం సాయంత్రం రాయచూర్ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఓ లారీ ప్రమాదవశాత్తు బ్రేకులు ఫెల్‌కావడంతో పోలీసులు రోడ్డుకు అడ్డంగా ఉంచిన భారీకేడ్‌లను తోస్తూ వెళ్లింది. ఆ సమయంలో రోడ్డు పక్కన ఉన్న ప్రజలు తమ ప్రాణాలను తృటిలో తప్పించుకున్నారు. అలాగే డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఆయనను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

అయోడిన్ లోపంపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ధన్వాడ: మండలంలోని కిషాపూర్, కొండాపూర్, రామకిష్టాయిపల్లి గ్రామాల్లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఆదివారం అయోడిన్ లోపంపై కళాకారులు ప్రదర్శన నిర్వహించారు. అయోడిన్ లోపం ఉంటే మందబుద్ధి, శారీరక ఎదుగుదల లోపిస్తుందని ప్రజలకు వివరించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు అయోడిన్ ఉండే చేపలు, రొయ్యలు, కూరగాయలు, ఆకుకూరలు, పాలు నాణ్యమైన పౌష్టికాహారం ప్రతి రోజు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు శ్రీకాంత్, కృష్ణ, నర్సింహ, కిరణ్, ఆనందమ్మ, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ జాబితా విడుదల



రుణమాఫీ జాబితా చూస్తున్న రైతులు

కృష్ణా: మండలంలోని ఐనాపూర్, చేగుంట, తంగిడి గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయం నోటీస్ బోర్డుపై ఆదివారం రైతు రుణమాఫీ జాబితాను వ్యవసాయ అధికారులు ఉంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల ఆయా గ్రామాల్లోని వ్యవసాయ రైతులకు సంబంధించిన రుణాలను మాఫీ చేయడం జరిగిందని, అందుకు సంబంధించిన వారి జాబితాను నోటీస్ బోర్డుపై అంటించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు సునిల్‌కుమార్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

సిటిజన్ క్లబ్‌లో లైబ్రరీ ఏర్పాటుకు తీర్మానం



సమావేశం నిర్వహిస్తున్న సభ్యులు

నారాయణపేట రూరల్: పట్టణంలోని సిటిజన్ క్లబ్ కార్యవర్గ సభ్యులు ఆదివారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించి ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. ఈ మేరకు గేటు మరమ్మతు, సెటిల్ క్రీడకు సంబంధించి ఉడెన్ కోట్, లైబ్రరీ ఏర్పాటు, అన్నిరకాల దిన, వార, పక్ష, మాస పత్రికలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇకనుంచి వారానికి ఒక రోజు శనివారం సాయంత్రం 6 గంటలకు సభ్యుల సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో మనోహర్ గౌడ్, వెంకటయ్య, నాగురావు నామాజీ, మల్లికార్జున్, గోపాల్, నాగరాజు, ఓంప్రకాష్, దామోదర్, వెంకట్ రాములు, సత్యనారాయణ పాల్గొన్నారు.

రహదారులను మరమ్మతు చేయాలి



నర్వ: మండలంలోని ప్రధాన రహదారులు గుంతలు పడి ప్రయాణ ఇబ్బందులు పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మండలం నుంచి రాంపూర్ గేట్ వరకు, యాంకి నుంచి పెద్దకడ్మూర్ వరకు, నర్వ నుంచి రాయికోడ్ వెళ్లే బీటీ రోడ్డు అడుగడుగునా ధ్వంసమై గోతులు పడ్డాయన్నారు. నిత్యం ఈ రోడ్డు గుండా ప్రయాణించే వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బీటీ రోడ్డును పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి మరమ్మతు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు



బహుమతులు అందిస్తున్న నాయకులు

ఊట్కూరు: మండలంలోని వివేకానంద, నేతాజీ యువజన ఉత్సవాల సందర్భంగా ఆదివారం ఏబీవీపీ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఊట్కూరు, పులిమామిడి తదితర గ్రామాల నుంచి వాలీబాల్ జట్లు పాల్గొన్నాయి. పోటీలలో ఊట్కూరు జట్టుకు మొదటి బహుమతి, పులిమామిడి రెండవ జట్టు గెలుపొందడంతో వారికి మెమెంటో, బహుమతులను అందించారు. కార్యక్రమంలో నాయకులు అరవింద్ కుమార్, భాస్కర్, సింగిల్‌విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఎల్కోటి జనార్దన్‌రెడ్డి, రమేష్, జగదీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'లక్ష డప్పులు.. వేయిగొంతులు' విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న కల్యాణ్‌మాదిగ

కోస్గి రూరల్: హైదరాబాద్‌లో వచ్చేనెల 7న నిర్వహించే లక్ష డప్పులు.. వేయి గొంతుకలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కల్యాణ్ మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం అతిథిగృహంలో ఆయన మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు తీర్పు మేరకు ఎబీసీడీ వర్గీకరణను చేపట్టి మాదిగలకు రావాల్సిన వాటాను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రమోద్ మాదిగ, బుర్రగాళ్ల కృష్ణ పాల్గొన్నారు.

సీఎంఆర్ హెల్త్ కో ఆర్డినేటర్‌గా సాయికిరణ్

దామరగిద్ద: మండలంలోని లోకూర్తి గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు సాయికిరణ్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో హెల్త్ కో–ఆర్డినేటర్‌గా ఎంపికయ్యాడు. నియోజకవర్గంలోని పేద మధ్యతరగతి కుటుంబాల అత్యవసర వైద్యసేవలకు అందించే సీఎంఆర్ సేవలను అందించేందుకు సాయికిరణ్‌ను అసిస్టెంట్ కో–ఆర్డినేటర్‌గా నియమించినట్లు ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్‌రెడ్డి తెలిపారు.



పకడ్బందీగా పంట భూముల పరిశీలన



ఇటుకబట్టీ వివరాలను నమోదు చేసుకుంటున్న అధికారులు

మరికల్: రైతు భరోసా పథకం కింద వ్యవసాయ యోగ్యం కాని భూముల పరిశీలనను అధికారులు పకడ్బందీగా చేపడుతున్నారు. జిల్లాలో రాళ్లు, రప్పలు, ముళ్లచెట్లు, వెంచర్లు, ఇటుకబట్టీలు, పరిశ్రమలకు వృథాగా ఉన్న పొలాలకు గత ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించినట్లు అధికారులు గుర్తించారు. సాగుకు యోగ్యం కాని ఈ భూములకు భరోసా సాయాన్ని ఇవ్వకుండా అధికారులు ప్రత్యేకంగా వివరాలను నమోదు చేసుకుంటున్నారు. జిల్లాలో గత యాసంగిలో 4,47,427 ఎకరాలకు, 1,55,511 మంది రైతులకు రూ. 223.62 కోట్లు రైతు భరోసా కింద వారి ఖాతాలో జమ చేసింది. ప్రస్తుతం సాగవుతున్న భూములు, సాగులో లేని భూముల వివరాల నమోదు కోసం ప్రభుత్వం చేపట్టిన సర్వే నేటితో ముగియనుంది.

పరిశ్రమలు, ఇటుకబట్టీలు, వెంచర్లు గుర్తింపు..

జిల్లాలో వ్యవసాయ భూముల జాబితాలో ఉండి పంటలు సాగు చేయకుండా, స్థిరాస్తి వెంచర్లుగా మారిన భూములు, ఏళ్ల తరబడి సాగుకు యోగ్యం కానీ భూములకు గతంలో రైతుబంధు వచ్చినట్లు అధికారులు గుర్తించారు. ఇలాంటి వాటిని గుర్తించి వాటి సర్వే నంబర్లు, అక్కడ వెలసిన వాటి ఫొటోలు విషయాలను నమోదుచేసుకొని ఇకపై భరోసా కింద పెట్టుబడి సాయం రాకుండా ఉండేందుకు చర్యలు తీసుకోనున్నారు.

ఈ నెల 20తో సర్వే పూర్తి కానుంది. 21నుంచి 24 వరకు గ్రామ సభలు నిర్వహించి, సర్వేలో సేకరించిన వివరాలను ప్రకటించి ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించనున్నారు. 24, 25న అనర్హుల జాబితాలను ప్రకటిస్తారు. 26న రైతు భరోసా పెట్టుబడి సాయం అందించడం కోసం కార్యాచరణ సిద్ధం చేయనున్నారు.

గ్రామ సభలో ప్రకటిస్తాం

క్షేత్రస్థాయిల్లో పంటల పరిశీలన వివరాలు సమగ్రంగా సేకరిస్తున్నాం. గతంలో సాగుకు నోచుకొని భూములకు వాటికి పెట్టుబడి సాయం అందించిన విషయాన్ని సర్వేలో గుర్తించాం. వాటి వివరాలు ఉన్నతాధికారులకు నివేదిక ద్వారా అందిస్తాం.

– జాన్‌సుధాకర్, జిల్లా వ్యవసాయధికారి, నారాయణపేట

21నుంచి గ్రామ సభలు

ఊట్కూరు: మండలంలో 21నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఆదివారం ఎంపీడీఓ ఒక ప్రకటనలో కోరారు. 21 నుంచి 24వరకు ఆయా గ్రామ పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహించి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులో ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాలను గ్రామసభలలో చదివి వినిపించి ఆమోదించబడుతుందని ఆయన తెలిపారు. గ్రామ సభలలో లబ్ధిదారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి స్థల పరిశీలన



ఇంటి కోసం స్థలం పరిశీలిస్తున్న నాయకులు

మరికల్: మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆదివారం కాంగ్రెస్ నాయకులు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా నాయకులు సూర్యమోహన్‌రెడ్డి, వీరన్న, ఓబీసీ చైర్మన్ కృష్ణయ్య మాట్లాడుతూ.. మరికల్ పాత బస్టాండ్ వద్ద ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన మోడల్ భవనం నిర్మించేందుకు స్థల పరిశీలన చేశామన్నారు. సోమవారం ఎమ్మెల్యే పర్ణికారెడ్డి మోడల్ ఇంటి నిర్మాణం పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హరీష్, రామకృష్ణ, రాజు, సత్యన్న, రామకృష్ణరెడ్డి, నాగరాజ్, కుర్మన్న, రాములు, మోహన్, రఘు, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని తిరిగి సాధించుకుందాం



మాట్లాడుతున్న దేశాయి ప్రకాష్‌రెడ్డి

అమరచింత: కోల్పోయిన నియోజకవర్గాన్ని సమిష్టిగా ఉంటూ తిరిగి సాధించుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాల్సిన అవసరం ఆసన్నమైందని మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని డీఎంఅర్‌ఎం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణంలో ఆదివారం అమరచింత నియోజకవర్గ సాధన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా అమరచింత నియోజకవర్గాన్ని కోల్పోవడం జరిగిందనే కారణాలను చూపకుండా.. ప్రస్తుతం 2026లో డీలిమిటేషన్ ద్వారా కొత్త నియోజకవర్గాల ఏర్పాటుకు ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయని దీంతో నియోజకవర్గ ప్రతిపాదన కోసం ప్రజాప్రతినిధులు కలిసి నివేదించాల్సిన అవసరం ఉందన్నారు. అమరచింత నియోజకవర్గం కాకముందు నుంచే సంస్థానంగా విరాజిల్లిందని, అలాంటి అమరచింత ఉనికిని కాపాడుకునేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, సీఎం రేవంత్‌రెడ్డితో పాటు బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణను కలిసి వినతిపత్రాలు అందిద్దామన్నారు. అనంతరం టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గాన్ని సాధించుకునేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పరంగా సీఎం, మంత్రులతో కలిసి వెళ్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, వైస్ చైర్మన్ జీఎస్ గోపి, కౌన్సిలర్లు మంగలావణ్య, సింధు, రాజ్‌కుమార్, నాయకులు నరసింహులుగౌడ్, రాజన్న, మహంకాళీ శ్రీనివాసులు, అరుణ్‌కుమార్, శ్యాంసుందర్, మేర్వరాజు, భాస్కర్, అడ్వకేట్ రాజేందర్, ఆర్‌ఎస్ శంకర్, తెలుగు తిరుమలేష్, తదితరులు పాల్గొన్నారు.